ప్రజల పక్షాన నిలబడేదే బీఆర్ఎస్ : ఎమ్మెల్యే కాలేరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆనాడు ఉద్యమంలో ఆ తర్వాత పదేళ్ల అధికారంలో నేడు ప్రతిపక్షంలో ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా వారి పక్షాన నిలబడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. ఏనాటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శ్రీరామ రక్ష గులాబీ జెండా మాత్రమేనన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీహెచ్.చంద్రమోహన్ అధ్యక్షతన శివం రోడ్‌లోని ఓ హోటల్‌లో డివిజన్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవానికి పార్టీశ్రేణులు దండుగా తరలిరండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బాగ్‌అంబర్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.మహేష్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

గోల్నాక: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజితోత్సవ సభకు జనం తరలి రావాలని అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబోలు నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల గుండెలు అదిరేలా సభకు బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు.

● **ముషీరాబాద్:** బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లటోని ఎస్‌బీఐ కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సారథ్యంలో భోలక్‌పూర్ నుంచి 500 మందికిపైగా కార్లు, బస్సులలో ర్యాలీగా తరలివెళ్లాలన్నారు. ఈ సమావేశంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ పరిశీలకుడు దీన్‌దయాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, నాయకులు మనవర్‌చాంద్, చాంద్‌పాషా, జబ్బర్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : మాజీ కార్పొరేటర్



వైభవ్‌నగర్‌లో వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

నల్లకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషిచేస్తున్నామని మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డివిజన్‌లోని వైభవ్‌నగర్ కాలనీ వాసుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్క్ రీమోడల్, సీసీ కెమెరాల ఏర్పాటు, వర్షం నీటి సమస్యలను మాజీ కార్పొరేటర్‌కు విన్నవించారు. దీనికి సంబంధించిన వినతిపత్రం కాలనీవాసులు ఆయనకు అందజేశారు. కాలనీ సమస్యలను వెంటనే ఆయా శాఖల అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మధుసూదన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ హరిచరణ్, యాదగిరి, భార్గవ్, బీఆర్ఎస్ నాయకుడు మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటికలను బీసీ 'ఏ' గ్రూపులో చేర్చాలి



కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, రమేష్‌కుమార్ తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలలో వెనుకబడిన ఆరె కటికలను బీసీ 'ఏ' గ్రూపులో చేర్చాలని మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, ఆరెకటిక సంఘ్ ఇసామియాబజార్ అధ్యక్షుడు హెచ్.రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరె కటికలను బీసీ డీ గ్రూపులో చేర్చడం వల్ల అన్ని రంగాలలో అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివారం నింబోలిఅడ్డలోని ఏకేభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆరె కటికల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో వితంతువు పెన్షన్, పేద విద్యార్థులకు బ్యాగులు, ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జ్ఞానేందర్, ఉపాధ్యక్షుడు సాయిసచ్చిదానంద్, కోశాధికారి సూర్యప్రకాష్‌సింగ్, హరినారాయణ, ఇ.శంకర్, నరహరి, శ్యామ్‌సుందర్ దితరులు పాల్గొన్నారు.

రవాణారంగ కార్మిక సమస్యలను పరిష్కరించాలి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగన్నగౌడ్ తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రవాణారంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఆల్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) ప్రధానకార్యదర్శి వై.నాగన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఆయన వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. రవాణ రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రవాణారంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లపై మహేష్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ క్యాబ్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బి.రామకృష్ణారెడ్డి, జీహెచ్ఎంసీ ఆటోయూనియన్ అధ్యక్షుడు ఎస్.దయానంద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైల్వే ప్రయాణికుడి సెల్‌ఫోన్లు, నగదు చోరీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుడి సెల్‌ఫోన్‌లు, నగదు దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన జ్ఞానేశ్వర్ రాందాస్ తిరుపతి నుంచి ఆకోల ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తుండగా కాచిగూడ వద్దకు రాగానే బ్యాగును దొంగలు తస్కరించారు. బ్యాగులో రెండు సెల్‌ఫోన్‌లు, రూ.10 వేల నగదు ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రేటర్ పారిశ్రామికీకరణకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్



జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న అరవింద్‌కుమార్‌గౌడ్, సాయిబాబా తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ సిద్ధాంతాలు, ఆశయాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు కొనసాగిస్తూ విద్యా, వైద్యం, రవాణా, వ్యవసాయం, సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పారిశ్రామికీకరణకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని, దేశ, విదేశాల నుంచి పెట్టుబడులను రాబట్టి లక్షలాది యువత ఉపాధికి దోహదపడ్డారని అన్నారు. ఆదివారం టీడీపీ నగర కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకల కార్యక్రమం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చంద్రబాబు విద్యను ఒక యజ్ఞంగా నిర్వహించారన్నారు. జంటనగరాలుగా ఉనర్న హైదరాబాద్, సికింద్రాబాద్‌కు ధీటుగా 3వ నగరం సైబరాబాద్‌ను సృష్టించి, ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. నాడు చంద్రబాబు ముందు చూపువల్ల ఐటీ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక లక్షల మందికి నేడు ఉపాధి దొరుకుతోందన్నారు. ఐటీని అభివృద్ధి చేయడంలో, హైదరాబాద్ రూపురేఖలు మార్చడానికి చంద్రబాబు కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎంఏ.సిద్ధిఖీ, కట్టరాములు, పరుశరామ్, ఎస్.ప్రకాష్, చంద్రమోహన్, మోహన్, రాజు, ప్రదీప్‌గౌడ్, అనిల్‌కురుమ, శ్యామ్‌సుందర్, కిరణ్, భానుప్రకాష్, సత్యానారాయణ, జగదీష్‌గౌడ్, రామారావు, మహేందర్, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో చీరలు పంపిణీ



చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్‌లో భవానీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నైషధం సత్యనారాయణమూర్తి, కట్ట రాములు, నర్సింగ్‌గౌడ్, గోపి. టీ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కేక్ కట్ చేశారు. మహిళలకు చీరలను పంపిణీ చేశారు.



టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ నాగు నగేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు.

పిల్లలకు స్వీట్లు పంపిణీ



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తాలో చిన్నారికి స్వీట్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్

టీడీపీ రాంనగర్ డివిజన్ నేత చంద్రమోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తాలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. పిల్లలకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జి.శంకర్, యాదగిరి, ఉదయ్‌గుప్తా, శ్రీనివాస్, అన్నపూర్ణ, లక్ష్మి, మీన తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు చంద్రబాబు



నల్లకుంటలో కేక్‌ను పిల్లలకు తినిపిస్తున్న దశరథ్ తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాడు గ్రేటర్ హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, నిరుద్యో యువతకు ఉద్యోగ భద్రత కల్పించడానికి చేసిన ఘనత ప్రస్తుత ఏపీ సీఎం నారా చంద్రబాబు హయాంలోనే జరిగిందని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ పేర్కొన్నారు. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో చిన్నారులచే కేక్ కట్ చేసి ఆయన వారికి కేక్‌లు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.కృష్ణ, రాజు, నాని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బోధన, బోధనేతర సిబ్బందికి సింగిల్ విండో పద్ధతిలో జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మోహినుద్దీన్

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి సింగిల్ విండో పద్ధతిలో ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్(డీఏటీఏ) అధ్యక్షుడు ప్రొఫెసర్ మోహినుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2025-26, 2026-27 బ్లాక్ పీరియడ్ ఫీజులకు సంబంధించిన ఏఎఫ్ఆర్‌సీ గైడ్‌లైన్స్ ప్రకారం ఆదాయ, వ్యయాలను క్షుణ్ణంగా పరిశీలించి ఫీజులను ఖరారు చేస్తూ ప్రైవేట్ కాలేజీలు చారిటీ సంస్థలుగా కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాకవి జయరాజు, ప్రొఫెసర్ వెంకటదాసు మారేడు, ప్రొఫెసర్ స్వామిదాసు, ప్రొఫెసర్ శ్రావణ్‌కుమార్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ప్రొఫెసర్ నర్సయ్య, ప్రొఫెసర్ శోభారాణి, ప్రొఫెసర్ శ్రీశోభ, బాగయ్య, కోలా జనార్దన్, డాక్టర్ వనమాల మాట్లాడారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఇంజనీరింగ్‌ను వ్యాపారంగా మార్చి లాభాలను ఆర్జిస్తున్నాయని అధ్యాపకులను సరైన జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. మేనేజ్‌మెంట్, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. యూజీసీ, ఏఐసీటీఈ, టీఏఎఫ్ఆర్‌సీ వంటి ప్రభుత్వ రంగ సంస్థల నిబంధనలు అమలు జరిగేలా చూడాలన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాల్, జైసింహ

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం ఆజామాబాద్ లోని వీఎస్టీ పార్కులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసాచారి, చైర్మన్ డాక్టర్ కె.రామానందం, సభ్యులు లింగ ప్రకాష్, నాగభూషణం, కందూరి కృష్ణ, జి.గౌరీశంకర్, కృష్ణకుమారి, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కందూరి కృష్ణకు సత్కారం**



కందూరి కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలో ప్రతిరోజూ పేదలకు అన్నదానం ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కందూరి కృష్ణ సేవలను గుర్తించి ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ 2024 గవర్నర్ వై.శ్రీనివాస్ ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నాగభూషణం పాల్గొన్నారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి



బాబులాల్‌కు నియామక పత్రం అందజేస్తున్న జితేందర్‌రెడ్డి

ఒలంపిక్ అసోసియేషన్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా బాబులాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా బాబులాల్ నియమితులయ్యారు. ఆదివారం ఆయనకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబులాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన జితేందర్‌రెడ్డి, కార్యదర్శి మల్లారెడ్డి, చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అంజనికుమారికి సోషల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సిటీసివిల్ కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారి సోషల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 21న ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును హాస్యబ్రహ్మ, సీనియర్ జర్నలిస్ట్ శంకర నారాయణ బహూకరిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

ఆకట్టుకున్న నిరంతరాయ గానాలాపన

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన సయ్యద్స్ వాయిస్ మ్యూజికల్ ఈవెంట్స్ వ్యవస్థాపకుడు సయ్యద్ బాజీ 11 విభిన్న భాషల్లో 12 గంటల్లో 120 పాటలు నిరంతరాయంగా పాడి శ్రోతలను ఆకట్టుకున్నారు. ఆదివారం త్యాగరాయ గానసభలో ఈ కార్యక్రమం జరిగింది. ఒక గాయకుడు ఆరుగురు గాయనీమణులు కలిసి గానం చేశారు. కాగా ఈ కార్యక్రమాన్ని వండర్ బుక్ ఆఫ్ ఇండియా రికార్డులో నమోదు చేసి, రికార్డును ప్రముఖ సినీనటుడు సుమన్, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, రికార్డు ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ బాజీకి అందజేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బేగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన సునీల్‌కుమార్ శర్మ(36) ఉపాధి కోసం నగరానికి వచ్చి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజుకు వచ్చే రూ.500 సరిపోక ఈజీగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అనుగుణంగా బీదర్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫతేనగర్‌లోని సికిందర్ మున్నా అన్సారి అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా సనత్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వీరి నుంచి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

'పాత్రికేయుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరంతరంగా కొనసాగుతున్న జర్నలిస్టుల ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. ఆదివారం త్యాగరాయగానసభలో జరిగిన దివంగత సీనియర్ జర్నలిస్ట్ యడ్లపల్లి నాగరాజు సంతాపసభను నిర్వహించారు. నాగరాజు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫలితంగా అనేకమంది జర్నలిస్టులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సంక్షేమానికి నూతన పాలసీ తీసుకురావాలని, ఆపదలో ఉన్న జర్నలిస్టులను ఆదుకోవాలని అన్నారు. ఈ సంతాపసభలో సీనియర్ జర్నలిస్టులు ఉప్పు సత్యనారాయణ, జె.పద్మారావు, మోహన్‌రావు, జగన్‌రెడ్డి, యుగంధర్, పొగాకు బాలకృష్ణ, రమేష్, జీహెచ్‌జె హౌసింగ్ సొసైటి డైరెక్టర్ యర్రమిల్లి రామారావు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.పాండురంగారావు, ఫొటో జర్నలిస్టులు శ్రీధర్, రహీం, పర్వతాలు తదితరులు నాగరాజుకు నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



దైవసందేశం వినిపిస్తున్న ఎబినైజర్

చిక్కడపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈస్టర్‌సువార్త ర్యాలీని ఆదివారం నిర్వహించారు. గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీకి నాయకత్వం వహించిన చర్చి స్థానిక దైవసేవకులు జోసెఫ్ పి.కురియన్, చర్చి సొసైటీ చైర్మన్ జాన్ సుందరం, దైవసేవకులు ఎం.ఇమ్మాన్యుయేల్, మోజెస్, డేవిడ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమెరికా నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన సీనియర్ దైవజనులు సాల్మన్ ఎబినైజర్ దైవ సందేశం వివరించారు.

చంద్రబాబు ఆదర్శంగా సామాజిక సేవ



చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం వద్ద పేదమహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు భవాని శ్రీనివాస్ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును ఆదర్శంగా తీసుకుని సామాజికసేవలో పాల్గొంటున్నామని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ తెలిపారు. టీడీపీ గాంధీనగర్ డివిజన్ ఇన్‌చార్జి భవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం వద్ద పేద మహిళలకు చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు భవాని శ్రీనివాస్, నైషధం సత్యనారాయణ, కట్టా రాములు,నర్సింగ్‌గౌడ్, గోపి, టి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన విభావరి



గానం చేస్తున్న భువన రాధారాణి తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్వర ఝరి భువన భాస్కర సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉషోదయా స్టూడియోలో అలరించింది. ప్రముఖ గాయకులు టీవీఎస్‌రావు ఆశీస్సులతో 79వ కార్యక్రమంగా నిర్వహించారు. ప్రముఖ గాయని భువన రాధారాణితోపాటు పలువురు గాయనీగాయకులు పలు పాత, కొత్త చిత్రాల గీతాలను మధురంగా ఆలపించారు. ఉషోదయా ఫౌండేషన్ చైర్‌పర్సన్ డా.ధనాశి ఉషారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని గాయనీగాయకులను అభినందించారు. గాయకులు యజ్ఞప్రసాద్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిసి పూలబొకే అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కవాడిగూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా విద్యుత్ బిల్లుల్లో హెచ్చుతగ్గులు, వివిధ సమస్యలపై ఈనెల 26న పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు ఇందిరాపార్కు ఆపరేషన్ సబ్ డివిజన్ ఏడీఈ ఏపీబీ సంపత్ తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉన్న ఇందిరాపార్కు ట్రాన్స్‌కో ఏడీఈ సబ్ డివిజన్ కార్యాలయంలో కన్స్యూమర్ గ్రీవెన్స్ సమావేశం ఉంటుందన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, టెక్నికల్ మెంబర్, ఫైనాన్స్, కన్స్యూమర్ ఎఫైర్స్ అధికారులు, సిబ్బంది హాజరు కానున్నారని తెలిపారు. వినియోగదారులు దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతోపాటు బిల్లుల్లో హెచ్చుతగ్గులు విషయంపై కూడా ఈ పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362